క్లుప్తంగా

చెన్నకేశవ స్వామికి మంత్రి జోగి రమేష్ పూజలు

గూడూరు: చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాల్లో రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి స్వామి వారి దివ్య కల్యాణం కనుల పండువగా జరిగింది. శుక్రవారం ఆలయానికి వచ్చిన మంత్రి జోగి రమేష్‌ను ఆలయ అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. ఎంపీటీసీ జక్కా ధర్మారాయుడు, ఆలయ కమిటీ చైర్మన్ గోళ్ల శివనాగ మల్లికార్జునరావు, ఆలయ కార్యనిర్వహణాధికారి టీవీవీ మోహనరావు, ధర్మకర్త గల్లా వెంకటరత్నం మంత్రిని ఘనంగా సత్కరించారు. అనంతరం ఆలయంలో భారీ అన్నసమారాధన నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యుడు వేముల సురేష్ రంగబాబు, సర్పంచి చిన్నం వెంకటరమణమ్మ, తరకటూరు గూడూరు పీఏసీఎస్ చైర్మన్లు గల్లా నాంచారయ్య, తలుపుల వెంకట కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు సామూహిక సీమంతాలు



గూడూరు: ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గూడూరులోని వెలుగు కార్యాలయంలో గూడూరు సెక్టారు పౌష్టికాహార పక్షోత్సవాలు శుక్రవారం నిర్వహించారు. ఎంపీపీ సంగా మధుసూదనరావు, జెడ్పీటీసీ సభ్యుడు వేముల సురేష్ రంగబాబు మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సీడీపీఓ కె.గ్లోరి ఆధ్వర్యంలో గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. గూడూరు పీఏసీఎస్ చైర్మన్ తలుపుల వెంకట కృష్ణారావు, డైరెక్టర్ ఆకూరి శ్రీను, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థికి ఆర్థిక సాయం



చిలకలపూడి(మచిలీపట్నం): ప్రతిభ కనబరిచిన పేద విద్యార్థికి సహాయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో డీఆర్వో ఎం. వెంకటేశ్వర్లు చేతుల మీదుగా శుక్రవారం రూ. 15వేలు అందజేశారు. పెడన భట్టా జ్ఞానకోటయ్య జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు వరదా వినయ్‌కుమార్, ఎస్. దుర్గామణికంఠ ఇటీవల న్యూఢిల్లీలో జరిగిన 5వ యాన్యువల్ ఇంటర్నేషనల్ ఇన్నో హెల్త్ కాన్ఫరెన్స్‌లో పాల్గొని అమెరికాలోని డల్లాస్‌లో జరిగే అంతర్జాతీయ సదస్సుకు అర్హత సాధించారు. సహాయ ఫౌండేషన్ ప్రతినిధులు ఎండీ ఉస్మాన్‌బాషా, బొమ్మిడి అయ్యప్ప స్వామి, మేడిశెట్టి ఆదిత్య, కోన వెంకటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఐదు వేల మందికి అన్నసమారాధన

కోడూరు: శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని కోడూరులోని మెరకగౌడపాలెం రామాలయం వద్ద శుక్రవారం ఐదు వేల మందికి అన్నసమారాధన నిర్వహించారు. ఉదయం స్వామివార్లకు ప్రత్యేక పూజలు జరిగాయి. ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, శాసనసభ మాజీ ఉప సభాపతి మండలి బుద్ధప్రసాద్, రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావులు వేర్వేరుగా పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు స్వామివార్ల చిత్రపటాలను, ప్రసాదాలను రమేష్‌బాబు, బుద్ధప్రసాద్, నరసింహారావులకు అందించి, దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు.

నేడు ఆసరా చెక్కు అందజేత

కృత్తివెన్ను: డ్వాక్రా అక్కచెల్లెమ్మలకు రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ ఆసరా పథకం కింద విడుదల చేసిన డ్వాక్రా రుణ మాఫీ చెక్కులను సోమవారం కృత్తివెన్నులో రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అందజేస్తారని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ వెంకట్రాజు తెలిపారు. స్థానిక శివాలయం సమీపంలో ఉదయం 10 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందని చెప్పారు.

ఈఓపీఆర్డీ వెంకటేశ్వరరావు బాధ్యతల స్వీకారం

కృత్తివెన్ను: కృత్తివెన్ను మండలం ఈఓపీఆర్డీగా ఎన్. వెంకటేశ్వరరావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ముదినేపల్లి మండలంలో పనిచేసిన ఆయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇప్పటి వరకు ఇన్‌చార్జి ఈఓపీఆర్డీగా మార్కండేశ్వరరావు పని చేశారు.

ప్యాడ్లు, పెన్నులు పంపిణీ

బంటుమిల్లి: మండల పరిధిలోని పలు ప్రభుత్వ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు బంటుమిల్లికి చెందిన సాయి సిద్ధార్థ జూనియర్ కాలేజీ యాజమాన్యం ప్యాడ్లు, పెన్నులను శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ చినబాబు, జెడ్పీటీసీ వెంకటరమణ పాల్గొన్నారు. పెందుర్రు ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి కాశిన వెంకటేశ్వరరావు మంజులూరు, చోరంపూడి, అర్తమూరు, కంచడం పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులు అందజేశారు.

జగనన్నకు ప్రజలే అండ

మంత్రి జోగి రమేష్





బంటుమిల్లిలో వైఎస్సార్ ఆసరా నమూనా చెక్కును అందజేస్తున్న మంత్రి జోగి రమేష్; కోడూరులో చెక్కును మహిళలకు అందిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి



బందరులో చెక్కును అందజేస్తున్న పేర్ని కిట్టు, మేయర్ వెంకటేశ్వరమ్మ



రాయవరంలో చెక్కులు అందజేస్తున్న మంత్రి జోగి రమేష్

బంటుమిల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ప్రజలు అండదండగా నిలుస్తున్నారని, ఎవరెన్ని కుట్రలు పన్నినా మళ్లీ వైఎస్ జగన్‌మోహన్ రెడ్డినే సీఎంగా ప్రజలు ఆశీర్వదిస్తారని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి జోగి రమేష్ అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఆవరణలో వైఎస్సార్ ఆసరా చెక్కు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. బంటుమిల్లి, పెందుర్రు, కొర్లపాడు, మల్లేశ్వరం, నాగేశ్వరరావుపేట గ్రామాల పరిధిలోని 295 స్వయంశక్తి సంఘాల సభ్యులకు మంజూరైన రూ. 2,50,15,510 విలువగల చెక్కును మంత్రి డ్వాక్రా మహిళలకు అందజేశారు. ఎంపీపీ వి. చినబాబు అధ్యక్షతన జరిగిన సభలో మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి కుటుంబాన్ని నవరత్నాల పథకాల ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్షాధికారులను చేశారన్నారు. జగనన్నను ఢీ కొట్టలేక చంద్రబాబు పొత్తుల కోసం నానా తంటాలు పడుతున్నారని విమర్శించారు. ప్రతి పేదవాడి ఇంటి ముంగిటకు ప్రభుత్వ పథకాలు చేర్చిన మనసున్న ముఖ్యమంత్రి జగనన్నను అక్కచెల్లెమ్మలు మరలా ఆశీర్వదించాలని కోరారు. తొలుత దివంగతనేత వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలు గ్రామాలకు చెందిన మహిళలు తాగునీరు, డ్రెయినేజీ, అంతర్గత రోడ్లు తదితర సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఐసీడీఎస్ అధికారులు ఏర్పాటు చేసిన పౌష్టికాహార ఎగ్జిబిషన్‌ను సందర్శించి స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి పలువురు గర్భిణులకు సీమంతం చేశారు.

అక్కచెల్లెమ్మలకు జగనన్న బాసట

కోడూరు: అక్కచెల్లెమ్మలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాసటగా నిలిచారని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. మహిళలకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తూ ఆర్థిక సాధికారత దిశగా అడుగులు వేస్తున్నారని చెప్పారు. కోడూరు వెలుగు కార్యాలయం వద్ద వైఎస్సార్ ఆసరా వేడుకలను శుక్రవారం నిర్వహించారు. మండలంలోని 1,006 గ్రూపులకు చెందిన 9,864మందికి మూడో విడత ఆసరా కింద విడుదలైన రూ.10.46 కోట్ల చెక్కును డ్వాక్రా మహిళలకు రమేష్‌బాబు అందించారు. వీరితో పాటు 319 మంది ఉన్నతి లబ్ధిదారులకు రూ.1.51 కోట్ల నగదు చెక్కును పంపిణీ చేశా రు. అనంతరం మహిళలతో కలిసి సీఎం జగనన్న చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అవనిగడ్డ ఏరియా కో-ఆర్డినేటర్ రవికుమార్ అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో రమేష్‌బాబు మాట్లాడారు. అధికారంలోకి రాగానే డ్వాక్రా రుణమాఫీ చేస్తానని చెప్పిన మాటలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కట్టుబడి అక్కచెల్లెమ్మలకు అండగా నిలిచారని రమేష్‌బాబు వివరించారు. కోడూరు-అవనిగడ్డ రహదారిపై లేనిపోని రాద్ధాంతం చేస్తున్నారని, త్వరలోనే రహదారి నిర్మాణాన్ని ప్రారంభిస్తామన్నారు. నియోజకవర్గంలో ఏ అభివృద్ధి కార్యక్రమం చేసినా విమర్శలు చేయడం ప్రతిపక్ష పార్టీలకు పరిపాటిగా మారిపోయిందని విమర్శించారు. ప్రజల మద్దతు ఎప్పుడూ వైఎస్సార్ సీపీకే ఉంటుందని రమేష్‌బాబు తెలిపారు. రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు, దివి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీరవెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకట సత్యనారాయణ, ఎంపీపీ కొండవీటి వెంకట కుమారి, సర్పంచి వెన్నా షైనీ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పరిశె మాధవరావు, తహసీల్దార్ షేక్ లతీఫ్‌పాషా, ఇన్‌చార్జి ఎంపీడీఓ పాండురంగారావు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

సచివాలయ భవనం ప్రారంభం

బంటుమిల్లి: ఎన్ఆర్ఈజీఎస్ నిధులు సుమారు రూ. 40 లక్షలతో నిర్మించిన బంటుమిల్లి-1 సచివాలయ నూతన భవనాన్ని మంత్రి స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి శుక్రవారం ప్రారంభించి శిలా ఫలకాన్ని ఆవిష్కరించారు. మంత్రి మాట్లాడుతూ మండల కేంద్రంలో తొలి సచివాలయం ప్రారంభం చేసుకుని అన్ని సౌకర్యాలతో ప్రజలకు సేవలందించేందుకు సిద్ధమైందని చెప్పారు. సర్పంచ్ వి. కృష్ణవేణి, వైస్ ఎంపీపీలు ఓ.చిన్నారిబాబు, కె. లలిత, జెడ్పీటీసీ ఎం. వెంకటరమణ, ఏఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్ కె. గంగాధర్, పి. బాబూరావు, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ టి. శ్రీనివాసరావు, మంత్రి తనయుడు జోగి రాజీవ్, తహసీల్దార్ సత్యనారాయణమూర్తి, ఎంపీడీఓ జె. స్వర్ణభారతి, ఎంఈఓ కేఎస్‌వీ ప్రసాద్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాల చైర్మన్‌లు, నాయకులు పాల్గొన్నారు.

జగనన్న పాలనలో సంక్షేమ రాజ్యం

మచిలీపట్నంటౌన్: రాష్ట్రంలో సీఎం జగనన్న సంక్షేమ పాలన సాగుతోందని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జ్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అన్నారు. మూడో విడత ఆసరా పథకం కింద మంజూరైన రూ. 25.27 కోట్ల చెక్కును 28 డివిజన్లకు చెందిన డ్వాక్రా మహిళలకు శుక్రవారం ఆయన అందజేశారు. నాలుగు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పంపిణీ సభల్లో కిట్టు మాట్లాడారు. ప్రభుత్వ పథకాలను వివరించి సీఎం జగనన్న పాలనలో మీ కుటుంబానికి ఎక్కువ మేలులు జరిగాయని భావిస్తేనే ఆయనను మరోసారి దీవించాలని కోరారు. అనంతరం సీఎం జగనన్న చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ, ఎంయూడీఏ చైర్‌పర్సన్ బొర్రా దుర్గాభవాని, డిప్యూటీ మేయర్లు లంకా సూరిబాబు, తంటిపూడి కవిత థామస్ నోబుల్, మునిసిపల్ మాజీ చైర్మన్ షేక్ సలార్‌దాదా, మాజీ కౌన్సిలర్లు చిటికిన నాగేశ్వరరావు, కార్పొరేటర్లు, కో-ఆప్షన్ సభ్యులు, మెప్మా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న జగన్

గూడూరు: ఎన్ని కష్టాలనైనా భరించి ఇచ్చిన మాట నిలబెట్టుకునే మీ బిడ్డ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. గూడూరు మండలం రాయవరం క్లస్టర్‌లో వైఎస్సార్ ఆసరా వారోత్సవాలు శుక్రవారం సాయంత్రం నిర్వహించారు. రాయవరం క్లస్టర్ పరిధిలోని 150 స్వయం సహాయక సంఘాలలోని 1,493 మంది డ్వాక్రా అక్కచెల్లెమ్మలకు మంజూరైన రూ.1,67,95,399 వైఎస్సార్ ఆసరా చెక్కును మంత్రి జోగి రమేష్ డ్వాక్రా మహిళలకు అందజేసి మాట్లాడారు. మీ బిడ్డగా మీ బాగోగులు చూసుకుంటూ మీరు ఆర్థికంగా బలోపేతం కావాలని అహర్నిశలు శ్రమిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మీరంతా నిండు మనస్సుతో ఆశీర్వదించాలని కోరారు. మంత్రి జోగి రమేష్ తనయుడు జోగి రాజీవ్, గూడూరు ఎంపీపీ సంగా మధుసూదనరావు, జెడ్పీటీసీ వేముల సురేష్ రంగబాబు, సర్పంచి నందం మల్లీశ్వరి, పీఏసీఎస్ చైర్మన్ కోళ్ల బాలకృష్ణ, వైఎస్సార్ సీపీ నాయకులు గొరిపర్తి రవికుమార్, తలుపుల వెంకట కృష్ణారావు, కారుమంచి కామేశ్వరరావు, పర్ణం పెదబాబు, కోళ్ల నాంచారయ్య, నందం రవి, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

పశు వైద్యశాల సేవలు సద్వినియోగం చేసుకోవాలి

ఎమ్మెల్యే పేర్ని నాని



పశు వైద్యశాల శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే పేర్ని నాని

మచిలీపట్నంటౌన్: చిలకలపూడి హౌసింగ్ నిర్మిత కేంద్రం ప్రాంతంలో ఏర్పాటు చేసిన నూతన పశు వైద్యశాల విజిటింగ్ సెంటర్‌ను ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) శుక్రవారం ప్రారంభించారు. వైద్యశాల శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతంలోని పశు యజమానులు వైద్యశాల సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ, ఎంయూడీఏ చైర్‌పర్సన్ బొర్రా దుర్గాభవాని, పశు సంవర్ధక శాఖ జిల్లా అధికారి కె. చంద్రశేఖరరావు, పశు వైద్యశాల సహాయ సంచాలకులు జేవీ రమణయ్య, వైద్యులు, కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు. అనంతరం పశువులకు ఉచిత వైద్య సేవలు అందించారు.

ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని అమలు చేయాల్సిందే

డీఎంహెచ్‌ఓ గీతాబాయి



చిలకలపూడి(మచిలీపట్నం): ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని కచ్చితంగా అమలు చేయాలని, వారికి కేటాయించిన వారాల్లో గ్రామాలను సందర్శించి వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి జి. గీతాబాయి అన్నారు. ఆమె కార్యాలయంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పర్యవేక్షణ సిబ్బందితో శుక్రవారం సమావేశం నిర్వహించారు. గీతాబాయి మాట్లాడుతూ సాయంత్రం సమయంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి పిల్లలకు వైద్య పరీక్షలు చేయాలన్నారు. వ్యాధులను గుర్తిస్తే తగిన వైద్య సహాయం అందించాలని చెప్పారు. ప్రతి సచివాలయం పరిధిలో 104 సేవల ద్వారా ప్రమాదకర లక్షణాలు ఉన్న గర్భిణులను గుర్తించి పర్యవేక్షణ చేసి సురక్షిత కాన్పు అయ్యేలా చూడాలన్నారు. గర్భిణుల్లో రక్తహీనత, ధనుర్వాతాన్ని నివారించేందుకు తగిన వైద్య సేవలు అందించాలని సూచించారు. వైద్యులు శర్మిష్ఠ, కె. రత్నగిరి, సుదర్శనబాబు తదితరులు పాల్గొన్నారు.

15 లోగా చెరువులను నింపుకోవాలి

ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు



సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే సింహాద్రి

కోడూరు: దివిసీమలోని తీరప్రాంత గ్రామాల్లో వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు తెలిపారు. శుక్రవారం కోడూరు పంచాయతీ కార్యాలయం వద్ద ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీల అధికారులతో ఎమ్మెల్యే సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏప్రిల్ 15వ తేదీ వరకు కాలువలకు నీటిని విడుదల చేస్తారని, ప్రతి పంచాయతీ పరిధిలోని రక్షిత, ఊర చెరువులను నింపుకోవాలన్నారు. చెరువుల్లో నీటిని నింపడంలో పంచాయతీ అధికారులు అలసత్వం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. కోడూరు, నాగాయలంక మండలాల్లోని తీరప్రాంత ప్రజలకు ప్రతి రోజు పైపులైన్ ద్వారా మంచినీటిని సరఫరా చేయాలని ఆదేశించారు. రక్షిత మంచినీటి పథకానికి సంబంధించిన మోటర్లు, ఫిల్టర్‌బెడ్లలో ఏమైనా సాంకేతిక సమస్యలు ఉంటే ముందుగానే పరిష్కరించుకోవాలన్నారు. నీటి సమస్య అధికంగా ఉన్న గ్రామాలకు ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేసేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. మండలంలోని 11 సచివాలయ పరిధిలోని గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యే ఆయా సచివాలయాల సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వైఎస్సార్ సీపీ రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు, దివి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీరవెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకటసత్యనారాయణ, ఇరిగేషన్ డీఈ సత్యసాయి ప్రకాష్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పరిశె మాధవరావు, జిల్లా రైతు విభాగం కార్యదర్శి కొండవీటి వీరవెంకటనారాయణరావు పాల్గొన్నారు.

వంతెన నిర్మాణానికి కృషి

రైతులకు ఉపయోగపడేలా లింగన్నకోడు డ్రెయిన్‌పై వంతెన నిర్మాణానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. నరసింహపురం-సాలెంపాలెం గ్రామాల మధ్యలోని లింగన్నకోడు డ్రెయిన్‌పై ఇటీవల కూలిన వంతెన ప్రాంతాన్ని రమేష్‌బాబు స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి పరిశీలించి మాట్లాడారు. వంతెన నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

కల్వర్టు నిర్మాణాన్ని అడ్డుకున్న రైతులు

పెడన: నందమూరు నుంచి జింజేరు వైపుగా వెళ్లే రామరాజు ఛానెల్‌పై నందమూరు వద్ద లెవల్ డ్రాప్ నిర్మాణ పనులను రైతులు అడ్డుకున్నారు. ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో బందరు, పెడన నియోజకవర్గాలకు సంబంధించి సాగునీరు అందించే కాలువలపై ప్రత్యేక ప్యాకేజీ ద్వారా మంజూరైన నిధులతో ఈ పనులు చేపట్టారు. నందమూరు వద్ద దెబ్బతిన్న రెండు లెవల్ డ్రాప్‌లను ఇరిగేషన్ శాఖ నూతనంగా నిర్మించేలా చర్యలు చేపట్టింది. లెవల్ డ్రాప్‌ల నిర్మాణం బాగా లోతుగా చేపట్టడం వల్ల నీరు నిల్వ ఉండే పరిస్థితి ఉండదని, నీరు కిందకు వెళ్లిపోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఇంజిన్ల ద్వారా అయినా నీటిని తోడుకుంటూ పంటలు పండించుకుంటున్నామని, ఆ పరిస్థితి కూడా లేకుండా చేస్తే మేం ఏమి కావాలంటూ రైతులు వాపోయారు. ఇదే విషయాన్ని నందమూరు సర్పంచ్ పరసా నరసింహారావు మాట్లాడటానికి వెళ్తే అధికారులు నిబంధనలు ప్రకారం నిర్మిస్తున్నామని చెప్పారు. దీనితో రైతులు పనులను అడ్డుకున్నారు. ఈ విషయాన్ని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ దృష్టికి తీసుకువెళతామని, అప్పటి వరకు పనులు చేయవద్దని నిలుపుదల చేయించారు.

హెల్త్ కేర్ సపోర్టు ఫండ్ ఏర్పాటు చేయాలి

కోనేరుసెంటర్: కృష్ణా విశ్వవిద్యాలయంలో అకడమిక్ సెనేట్ సమావేశం విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె. రామమోహనరావు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. అకడమిక్ సెనేట్ సభ్యులు 50 మంది పాల్గొన్నారు. అత్యవసర, విపత్కర పరిస్థితుల్లో విద్యార్థులను ఆదుకునే విధంగా కేఆర్‌యూ హెల్త్ కేర్ సపోర్టు ఫండ్ ఏర్పాటు చేయాలని, క్రీడలు, సంస్కృతిని ప్రోత్సహించే విధంగా స్పోర్ట్స్ పాలసీని రూపొందించాలని, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ విభాగాల పటిష్టతకు మరింత కృషి చేయాలని, డిజిటల్ లైబ్రరీని పటిష్టపరిచే విధంగా విశ్వవిద్యాలయం డిజిటల్ సెంట్రల్ లైబ్రరీని అనుబంధ కళాశాలలతో అనుసంధానం చేయాలని, విద్య, క్రీడలు, సాంస్కృతిక, పరిశోధన రంగాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను, అధ్యాపకులను ప్రోత్సహించేందుకు ప్రతి ఏటా అప్రిసియేషన్ సమావేశం ఏర్పాటు చేయాలని, ఈ సమావేశాన్ని ఏప్రిల్‌లో నిర్వహించేందుకు సన్నాహాలు చేయాలని సభ్యులు తీర్మానించారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రామిరెడ్డి, అకడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ వైకే సుందరకృష్ణ, వివిధ విభాగాల అధ్యాపకులు, సెనేట్ సభ్యులు పాల్గొన్నారు.

భారత నావికాదళంలో అవకాశాలపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న నావికాదళం అధికారులు

కోనేరుసెంటర్: భారత నావికాదళంలో ఉపాధి అవకాశాలపై కృష్ణా విశ్వవిద్యాలయంలో శుక్రవారం నావికాదళ అధికారి లెఫ్టినెంట్ కమాండర్ భట్టాచార్య నేతృత్వంలో అధికారుల బృందం విద్యార్థులకు అవగాహన కల్పించింది. విద్యార్థులు నావికాదళంలో ఏ విధంగా చేరాలి, అవకాశాలను ఏ విధంగా అందిపుచ్చుకోవాలి అనే అంశాలను భట్టాచార్య వివరించారు. విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య కె. రామమోహనరావును కలిసిన నావికాదళ అధికారులు భారతదేశ సముద్ర వారసత్వ సంపద, సముద్ర చరిత్ర పునరుద్ధరణపై విద్యార్థులకు అవగాహన కల్పించడం ద్వారా భారత పౌరులను నావికాదళంలో చేర్చేందుకు అవకాశం ఉంటుందని నావికాదళ అధికారులు తెలిపారు. విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాల అసోసియేషన్ ఎన్‌సీసీ ఆఫీసర్ లెఫ్టినెంట్ డాక్టర్ డి. రామశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చిలకలపూడి(మచిలీపట్నం): విద్యుత్‌లైన్ల మరమ్మతుల కారణంగా నగరంలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ ఈఈ ఎం. భాస్కరరావు శుక్రవారం తెలిపారు. ఉదయం 9.30 నుంచి 11 గంటల వరకు రుస్తుంబాద, రాజాగారి సెంటర్, పాత బస్టాండ్, చెమ్మనగిరిపేట ప్రాంతాల్లో, మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల వరకు ఈడేపల్లిలోని శ్రీనివాస నగర్ కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని చెప్పారు.

మహాజన సభ సమావేశం

మోపిదేవి: ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో(2020-21) సంవత్సరం రుణాలు పొందిన రైతులకు రూ. 4,18,805 వడ్డీ రాయితీని తిరిగి చెల్లించారు. మోపిదేవి, పెదప్రోలు పీఏసీఎస్‌లో మహాజన సభ సమావేశం ఆయా చైర్‌పర్సన్‌లు రావి రాంప్రసాద్, ఆది రాంబాబు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. 2022-23 సంవత్సర జమా ఖర్చులను వివరించారు. అనంతరం అబ్‌కాబ్ అందించిన వడ్డీ రాయితీని రైతులకు, చేతి సంచులను రైతులకు అందజేశారు. సర్పంచ్ నందిగం మేరీ రాణి, పర్సన్‌లు కారుమూరి ప్రభుదాస్, కొమ్ము బాలకోటయ్య, సొసైటీ కార్యదర్శులు పాల్గొన్నారు.

చిరు ధాన్యాలను ఆహారంలో తీసుకోవాలి

ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జి.అరుణకుమారి

గుడివాడరూరల్: గర్భిణులు, బాలింతలు, తల్లులు ఆహారంలో తప్పనిసరిగా చిరు ధాన్యాలను తీసుకోవడం ద్వారా రక్తహీనతను నిర్మూలించుకోవచ్చునని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జి.అరుణకుమారి అన్నారు. మండలంలోని గంగాధరపురంలో పోషణ్ పక్వాడా వారోత్సవాల్లో భాగంగా గర్భిణులు, తల్లులు, బాలింతలు, పిల్లలతో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం శిశు సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తూ పోషక ఆహారానికి అధిక నిధులు కేటాయిస్తున్నారన్నారు. తప్పనిసరిగా గర్భిణులు, తల్లులు ఆహారంలో చిరు ధాన్యాలైన రాగులు, సజ్జలు, జొన్నలు, పెసలు, కొర్రలు, మినుములను తీసుకోవాలన్నారు. ఇవి తీసుకోవడం ద్వారా అనేక అనారోగ్యాల నుంచి విముక్తి పొందవచ్చునన్నారు. పిల్లలు, తల్లులకు ఆయా అంగన్‌వాడీల్లోని కార్యకర్తలు పోషక ఆహారం పట్ల అవగాహన కల్పించాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్త, ఆశ వర్కర్లు, గర్భిణులు, బాలింతలు, తల్లులు పాల్గొన్నారు.

గుడ్లవల్లేరులో..

గుడ్లవల్లేరు: గర్భిణులు, బాలింతలు, బిడ్డ తల్లులకు చిరు ధాన్యాలతో ఎక్కువ పోషకాలు ఉన్న ఆహార పదార్థాలను తయారు చేసుకోవచ్చునని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వి.వాణి అన్నారు. అంగలూరులోని అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలు శుక్రవారం 'పోషణ్ పక్వాడా' కార్యక్రమాన్ని నిర్వహించారు. పోషక విలువలున్న చిరు ధాన్యాలతో పాటు మునగాకు, పాలకూర వంటి ఆకుకూరలతో రకరకాల వంటకాలను తయారు చేసి గర్భిణులు, బాలింతలు, బిడ్డ తల్లులను అంగన్‌వాడీలు అవగాహన పరిచారు. తక్కువ ఖర్చుతో పోషకాలున్న ఆహార పదార్థాలను తయారు చేసుకుంటే రక్త హీనత, బరువు తక్కువగా ఉన్న పిల్లలను కూడా సంరక్షించుకోవచ్చునని చెప్పారు. మహిళా సంరక్షణ కార్యదర్శి జె.పల్లవి, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీలు, గర్భిణులు పాల్గొన్నారు.

హరిపురంలో వృద్ధాశ్రమం నిర్మాణానికి శ్రీకారం



నిర్వాహకురాలు కుమారమ్మతో ఎమ్మెల్యే సింహాద్రి

కోడూరు: ఉల్లిపాలెం శివారు హరిపురం గ్రామానికి చెందిన మాగంటి కుమారమ్మ ఆర్థిక సౌజన్యంతో గ్రామంలోని రామాలయం సమీపంలో వృద్ధాశ్రమాన్ని నిర్మిస్తున్నారు. శుక్రవారం ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, వైఎస్సార్ సీపీ రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావులు హరిపురం గ్రామంలో పర్యటించి వృద్ధాశ్రమం ఏర్పాటు వివరాలను కుమారమ్మను అడిగి తెలుసుకున్నారు. నిరుపేదలైన వృద్ధులు 30 మందికి ఆశ్రయం కల్పిస్తూ వృద్ధాశ్రమాన్ని నిర్మిస్తున్నామని కుమారమ్మ చెప్పారు. వీరికి ప్రతి రోజూ భోజనం, అల్పాహారం వసతిని ఏర్పాటు చేస్తున్నామని, శుక్రవారం నుంచే రామాలయం ప్రాంగణంలో భోజన వసతిని ఏర్పాటు చేశామని చెప్పారు. కుమారమ్మ కృషిని రమేష్‌బాబు అభినందించారు. అనంతరం రామాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.


పట్టణ పరిశుభ్రత అందరి బాధ్యత



మున్సిపల్ కార్యాలయం వద్ద ప్రతిజ్ఞ చేయిస్తున్న ఏఈ రమ్య

పెడన: పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మున్సిపల్ ఏఈ బి. రమ్య అన్నారు. శుక్రవారం స్వచ్ఛ భారత్ మహోత్సవ్ 2020-23లో భాగంగా మున్సిపల్ కార్యాలయం సమీపంలో వార్డు సచివాలయాల శానిటరీ కార్యదర్శులు, పారిశుద్ధ్య కార్మికులతో పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుతామని ప్రతిజ్ఞ చేయించారు. ఏఈ మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పట్టణంలో వివిధ కార్యక్రమాల ద్వారా ప్రజలను చైతన్యం చేయాల్సి ఉందన్నారు. అందులో భాగంగా ర్యాలీ నిర్వహించి పరిశుభ్రత బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో శానిటరీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మోపిదేవి జెడ్పీ పాఠశాల విద్యార్థుల ప్రతిభ



మోపిదేవి: మోపిదేవి జెడ్పీ పాఠశాల విద్యార్థులు తక్కువ ఖర్చుతో విద్యుత్ టేబుల్ ల్యాంప్ తయారుచేసి జిల్లా స్థాయిలో ద్వితీయస్థానంలో నిలిచారని పాఠశాల హెచ్ఎం జయంతి తెలిపారు. పాఠశాల 9వ తరగతి విద్యార్థులు పి. నిఖిల్, కె. బాలవర్ధన్, కె. మహేష్‌కుమార్‌లు తక్కువ ఖర్చుతో టేబుల్ ల్యాంప్ తయారు చేసి అందరి ప్రశంసలు పొందారు. పాఠశాలలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో విద్యార్థులను, వారికి శిక్షణ ఇచ్చిన బి. పద్మజ, ఎం. అశోక్‌కుమార్‌ను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

యోగాతో మానసిక ప్రశాంతత

గుడ్లవల్లేరు: యోగాతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ఉత్తరాఖండ్ ఆది శంకర బ్రహ్మ విద్యాపీఠానికి చెందిన స్వామీ ఆత్మ స్వరూప్ అన్నారు. గుడ్లవల్లేరు వీవీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ కాలేజీలోని నాల్గవ సంవత్సరానికి చెందిన బి.ఫార్మసీ విద్యార్థినీ, విద్యార్థులకు శుక్రవారం నుంచి 15 రోజుల పాటు ఎన్ఎస్ఎస్ కింద యోగా శిక్షణ సదస్సులను కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.లక్ష్మణరావు ఆధ్వర్యంలో ప్రారంభించారు.